# ఇంటికి వెలుగులు

"అమ్మా, రేపు స్కూలు పిల్లలందరమూ పిక్నిక్ ప్రోగ్రాం వేసుకొన్నాం. ఏమంటావు?" పదేళ్ళ వాసూ, పన్నెండేళ్ళ వసంతా అడిగారు.

"నాకు తెలియదు. నాన్నగార్నడగండి. సెలవు పూట హాయిగా యింటి పట్టున పడుండక, ఈ గొడవలన్నీ ఎందుకు? తీరా వెళ్ళిం తర్వాత అకతాయి పన్లు చేసి, కాళ్లూ చేతులూ విరగ్గొట్టుకోడానికి! క్రితం ఏడు సుందర్రామయ్యగారబ్బాయి ఈతకని ఏట్లో దిగి..." రాజేశ్వరి ఏదో అనబోతూండగా, మధ్యలో ఆపింది వసంత.

"మాట్లాడితే ఇదో గొడవ నీతో! నాకెలాగూ ఈత రాదు. తమ్ముణ్ణి తాడేసి కట్టి, నీటిలో దిగకుండా చేస్తాను, సరేనా!"

"అలా వాళ్ళని గాజుబొమ్మల్లా పెంచవద్దని ఎన్నిమార్లు చెప్పాను? ఏ వయస్సుకా ఆటా పాటా లేందే, పిల్లలు కూపస్థ మండూకాల్లా ఉండిపోతారే తప్ప, మారే ప్రపంచంతో ఎదగలేరు! దెబ్బలు తగలందే ఆటల్లో సులువులు తెలియవు. ప్రయత్నం లేందే ఏ విద్యా రాదు. పోటీ లేందే చదువు రాణించదు. ప్రతిపక్షంలేని ప్రభుత్వం పాలన బావుండదు. కష్టాల్లేందే జీవితంలో సుఖం విలువ తెలియదు-" రాజారావు చదువుతోన్న పుస్తకం పక్కన పెడ్తూ అన్నాడు.

"మీ ఉపన్యాసాలకి సంతోషించాం కానీ, నేను కాదన్న దానికి మీరవునంటే, ఇహ పిల్లలు నా మాట విన్నట్టే! - నా ఆందోళన మీకేం తెలుస్తుంది?" - రాజేశ్వరి ఉక్రోషంగా అంది. ఆ మాటల వెనక బాధని రాజారావు గ్రహించకపోలేదు. రాజేశ్వరికి కళ్ల వెనక నీళ్ల కుండలకి కొదవలేదు. అందుకనే రాజారావు వెంటనే సమాధానమివ్వలేదు.

"అమ్మా! ప్లీజ్! అల్లరి చెయ్యనని చెప్తున్నాగా" వాసు గోముగా అడిగాడు.

రాజేశ్వరి మొగుడి వైపు చూసింది -

"చూశావా, నా అంగీకారం తెలియజేసినా, నువ్వు సరేనంటే కాని వాళ్ళు వెళ్ళడానికి సిద్ధంగా లేరు. ఏదో నీ మాట విననట్టుగా తెగ బాధపడిపోతావు! నేనంటేనే వాళ్ళు ఖాతరు చెయ్యంది!" రాజారావు నవ్వుతూ అన్నాడు. రాజేశ్వరికి ఆట కట్టయ్యింది. అయిష్టంగానే ఒప్పుకొంది. పిల్లలిద్దరూ గంతులేసుకొంటూ బయటకు పోయారు.

మర్నాడుదయం పిల్లలిద్దరూ వెళ్లిం తర్వాత, రాజేశ్వరి వంటపన్లు పూర్తిచేసుకొని ముందు హాల్లోకి వచ్చింది-

"రాజీ, ఇలా వచ్చి కూర్చో" అన్నాడు పేపర్లోంచి తల ఎత్తి రాజారావు.

"నాకవతల చాలా పన్లున్నాయ్" రాజేశ్వరి అంది. అతనెందుకు పిలుస్తున్నదీ తనకు తెలుసు. ఆ సంభాషణ రాజేశ్వరి కిష్టంలేదు.

"నీ పన్లకి అంతంటూ లేదు! పిల్లలిద్దరూ సాయంకాలం వరకూ తిరిగి రారు. తీరుబడిగా మాట్లాడ్డానికి యింత కంటే మంచి సమయం దొరకదు-" రాజారావు పేపరు బల్ల మీద పడేస్తూ అన్నాడు.

రాజేశ్వరి వెళ్ళి రాజారావు కెదురుగా కూర్చుంది ఇబ్బందిగా. అతనొక నిముషం వరకూ ఏమీ మాట్లాడలేదు. రాజేశ్వరే అంది. "ఊఁ చెప్పండి"

"నీకు తెలియని సంగతి కాదు. చాలా మార్లు నిన్ను కదిలేశాను. ఆ విషయం గురించి ఏమాలోచించావని అడుగుతున్నాను. పిల్లల భవిష్యత్తూ, మన భావి జీవితమూ ఈ నిర్ణయం మీద ఆధారపడి ఉంటాయి" - రాజారావు నెమ్మదిగా అన్నాడు.

"వాళ్ళని నా నుంచి దూరం చేస్తేనే కాని మీరు నిద్రపోరనుకొంటాను!" రాజేశ్వరి కళ్ళ వెనక నీళ్ళ కుండలు పగిలాయి. రాజారావు లేచి వెళ్లి పక్కన కూర్చుంటూ, రాజేశ్వరిని దగ్గరగా తీసుకొన్నాడు.

"రాజీ, వాళ్ల మీద నీకెంత మమకారం ఉందో, నాకూ అంతే ఉంది. నీ మనస్సులో

భయానికి రెండు రెట్లు భయం నాలో ఉంది. వాళ్ళను వదిలి నువ్వొక్క క్షణం కూడా లేకపోతే నేను అరక్షణం కూడా ఉండలేను. అలాగని ఈ విషయాన్ని వాళ్ల నుంచి ...ం నా కిష్టం లేదు. పెరిగి పెద్దయిన తర్వాత, అనుకోకుండా వాళ్ళు నిజాన్ని తెలుసు... అది ఎటువంటి పరిస్థితులకి దారి తీస్తుందో తెలియదు."

"వాళ్ళింకా పసివాళ్ళు. సున్నితమైన వాళ్ళ హృదయాలు, ఈ ఘాతానికి తట్టుకోలేవు. ...లు తెంచుకొనిపోతే భరించలేనండీ"

'జనన మరణాల మధ్య ప్రతి జీవినీ, యుగధర్మం పట్టుకొని పీడిస్తుంది. కాలం ...ముకు జరిగేకొద్దీ తరాల అంతరాలు మారిపోతాయి. వయసు పెరిగినకొద్దీ దృక్పథం ...తుంది. కన్న తల్లిదండ్రుల్ని వదిలి, తమ గమ్యాల కోసం ఎంతమంది తిరగబడట్లేదు! ...వరేం చెయ్యగల్గుతున్నారు? రెక్కలొచ్చిన పక్షులు గూడు వదలక మానవు" ...వు వేదాంత ధోరణిలో అన్నాడు.

"అందుకని, వాళ్ళతో మీరు మా బిడ్డలు కారని చెప్పమంటారు. ఎప్పుడో తెంచుకో... బంధాలకిప్పట్నుంచే, నాంది ప్రస్తావన చెయ్యమంటారు. ఎలా అనగలుగుతున్నారీ..."

"బిడ్డల్లేని బాధ గొడ్రాలికి తెలుస్తుంది. తల్లిదండ్రులు లేని బాధ అనాధలకు ...స్తుంది. వాళ్లకిప్పుడే ఈ విషయం తెలియజేస్తే...."

"కృతజ్ఞతతో కలకాలం మనల్ని వదలకుండా వుంటారనుకొంటారు. 'అమ్మా' అన్న ...లో నేనాశించేది ఆప్యాయత కాని, కృతజ్ఞత కాదు. అధికారం కాని, ఆర్థింపు కాదు. ...న్న చనువు కాని, మీరూ అన్న గౌరవం కాదు"

"అక్కడే నువ్వు పొరబడుతున్నావ్. వాళ్ళిద్దరూ నిజం తెలుసుకొన్న తర్వాత ఎలా ...రో, నేనూ ఊహించలేను. వాళ్ళ భావాల్లో, ప్రవర్తనలో పరిణామం కలగవచ్చును. ...ప్పుని మనం ధైర్యంగా ఎదుర్కొని, ఒక సక్రమమైన మార్గాన్ని అవలంబిస్తే కన్న ...ల్ని కూడా తెంచుకొని పోయే ఈ కాలంలో పెంచిన బంధాల్ని మరింత గట్టిగా ముడి ...వచ్చునంటున్నాను. మరో మాట - నేను రిటైరయ్యే సమయానికి వాళ్ళ చదువులు ... పూర్తి కావు. వచ్చే ప్రావిడెంట్ ఫండ్ వగైరాలు పూర్తిగా ఖర్చుపెడ్తేనే కాని, వాళ్ళని ...ళ్ళ మీద నిలబెట్టలేము. అలా నిలబెట్టవలసిన బాధ్యత మనకెంతైనా ఉంది. ఈ ...నిర్వహించడంలో, నేనెటువంటి పరిస్థితులకీ వెనకాడదలుచుకోలేదు. నేనెటొచ్చీ ...డేది, ఆ తర్వాత మన జీవితాల్ని గురించి. నా మాట ఎలా ఉన్నా, నీకే విధమైన ...లిగినా నేను భరించలేను. అందుకనే, నిజం తెలిపి, బంధాల్ని పటిష్టం చేసుకో... న్నాను. దీన్ని నువ్వు స్వార్థమను, మరేదైనా అను!" రాజారావు ఆవేశంగా అన్నాడు.

"వాళ్ళ దృష్టిలో ఆరాధ్య దైవాలుగా నిలవాలన్నదే మీ ఆశయమైతే, అలానే ...ండి!" రాజేశ్వరి చివాల్న లేచి, గదిలోకి పోయి, మంచం మీద పడి ఏడ్వసాగింది.

రాజేశ్వరికి నచ్చజెప్పే మరే మార్గమూ గోచరించలేదు రాజారావుకి. చేయదలచు... ంపో, తప్పో అతనికి అర్థం కాలేదు.

పండిన వంట అలానే ఉండిపోయింది. ఏడ్చి ఏడ్చి అలసిన రాజేశ్వరి మగతగా నిద్రపోయింది. మెలకువ వచ్చిన తర్వాత, చెదిరిన మనస్సుని మరోసారి కూడగట్టుకొని ఆలోచించసాగింది.

భర్తకి పిల్లల మీద అభిమానం, ఆప్యాయతా లేక కాదు. కాని ఏదో అర్థం లేని వెర్రి భయం ఆయన మనస్సులో ప్రవేశించింది. ఆ భయానికీ, తమ భవిష్యత్తుకూ ముడిపెట్టి, అనవసరంగా బాధపడ్తున్నాడు. తను ఆయన జీవితంలో అడుగుబెట్టింది మొదలు, తనే సర్వస్వమనుకొని జీవిస్తున్నాడు. ఎన్నేళ్ళయినా కడుపు పండకపోవడంతో, మానసికంగా తను చాలా దిగులుపడి పోయింది. వైద్య పరీక్షల్లో తనకి మాతృత్వం పొందే అవకాశం లేదని నిర్ధారణగా తెలిసిన తర్వాత, మరింతగా కృంగిపోయింది. మనశ్శాంతి చెడి తన పరిస్థితి మరీ అధ్వాన్నంగా తయారైనప్పుడు, ఆయన తనని దేశం అంతా తిప్పాడు. గాలి మార్పు వల్ల కొంత కుదుటబడ్డా, అంతరాంతరాల్లో ఉన్న బాధ అణగారకపోవడంతో, బెజవాడ స్టేషన్‌లో రైలు దిగగానే, అనాథాశ్రమానికి దారి తీశారు.

'రెండేళ్ల క్రితం ఈ పిల్లని కన్న స్త్రీ హాస్పిటల్లో చనిపోయింది. ఆమె ఎవరో తెలియదు. వారం రోజుల క్రితం, కనకదుర్గ మెట్ట దగ్గర ఓ చెట్టు క్రింద చనిపోయి పడున్న ఓ స్త్రీ పక్కన ఈ రోజుల పసికందు పార్లాడుతున్నాడు. మీ యిష్టం, ఎవర్ని పెంచుకొన్నా సరే" అనాధ శరణాలయంలో బాబా అన్నాడు.

తను ఆ పిల్లలిద్దరివంకా చూస్తూ ఉండిపోయింది. "రాజీ, ఆ పిల్లవాణ్ణి ఎత్తుకో" అన్నాడాయన. తను పిల్లవాణ్ణి మౌనంగా చేతుల్లోకి తీసుకొని, గుండెలకి హత్తుకొంది. ఆయన వంగి ఆ పిల్లనెత్తుకొని "రాజీ పద" అన్నాడు.

బాబా కళ్ళలోని ఆనంద భాష్పాలు తనెన్నటికీ మరవలేదు.

"ప్రజాసేవ చెయ్యడానికి రాజే కానఖ్ఖర్లేదు. దేవుడికి దగ్గరవాలంటే పూజారే కానఖ్ఖర్లేదు... తల్లి ప్రేమ కురిపించడానికి నవమాసాలు మోసి, కని పెంచాలని ఎక్కడా లేదు. ఎండ పొడన పయనించి సేద తీర్చుకోవడానికి వచ్చే బాటసారి, ఏ ఊరివాడు, ఏ జాతివాడు అని ఆలోచించదు, నీడ నిచ్చే చెట్టు. వీళ్లిద్దరికీ తల్లితండ్రులుగా మీ రక్షణ యివ్వండి. దేవుడు మీకు మేలు చేకూరుస్తాడు"

బాబా మాటలు ఈ రోజు వరకూ తను మరవలేదు.

చూస్తుండగానే విచిత్రంగా ఓ మలుపు తిరిగి, మోడువారిన తమ జీవితం, నందన వనం అయింది.

ఉన్నట్లుండి ఆయనకిదేం బుద్ధి పుట్టింది?!

హఠాత్తుగా రాజేశ్వరి ఆలోచనలు మరోలా ముందుకుసాగాయి.

వసంత మరో అయిదారేళ్లలో పెళ్ళీడుకొస్తుంది. దారిన పొయ్యే దానయ్యనెవర్నో ప్రేమించి, అతన్నే తప్ప పెళ్ళాడనని మొరాయిస్తే తనేం చేస్తుంది? ఆ దానయ్య గుణగణాలు తమకెలా తెలుస్తాయి? ఉన్నంతలో మంచి సంబంధం చూసి వసంత

కథా నిలయం
3532
శ్రీకాకుళం


జీవితం సుఖమయ్యం చెయ్యాలన్న తమ ప్రయత్నాలు ఏంకాను?

అలాగే వాసు పెరిగి పెద్దవాడవుతాడు. పెళ్లి జరుగుతుంది. ఆ వచ్చే పిల్ల గుణ గణాల మీద తమ భావి జీవితం ఆధారపడి ఉంటుంది. పెళ్ళాం కొంగు పట్టుకొని తమని తిరస్కరిస్తే, ఎంత బాధపడవలసి వస్తుందని?

కన్న తల్లిదండ్రుల్ని ఎదిరించే ఈ ధిక్కారం అలవడేది చనువు వల్లనే కదా! మొగుడి వాదనలోని అర్థాలు తన ఆలోచనలకు దోహదమిస్తున్నాయి.

రాజేశ్వరి లేచి ముందు హాల్లోకి వెళ్ళింది. రాజారావు సోఫాలో నిద్రపోతున్నాడు. వెళ్లి పక్కన కూర్చుంది. అయిదు నిమిషాల పాటు మొగుడికేసి చూసి, నెమ్మదిగా తట్టి లేపింది. రాజా రావు ఉలిక్కిపడి లేచాడు

"మీరన్నట్లుగానే చేద్దాం. చాలా ఆలశ్యమైంది- పదండి భోజనం చేద్దురుగాని" అంది.

రాజారావు వింతగా రాజేశ్వరిని చూస్తూ అన్నాడు- "నాకాకలిగా లేదు"

"నాకూ ఆకలిగా లేదు. వండిందంతా పనిమనిషికి పడేస్తాను. బజారుకెళ్లి జీడి పప్పూ, ద్రాక్షపళ్ళూ అవీ పట్టుకురండి. ఈ రాత్రికి వాళ్లకిష్టమైనవన్నీ చేస్తాను. రేపట్నించీ వాళ్ళకి కావల్సినవి అడుగుతారో, లేదో?" రాజేశ్వరి మాటల్లోని వ్యథ, రాజారావుకి విద్యుద్ఘాతంలా తగిలింది. మాట్లాడితే మరీ మెత్తబడవలసి వస్తుందని, మౌనంగా లేచి బజారుకి వెళ్ళాడు.

చీకటి పడే సమయానికి, వాసూ, వసంతా కేరింతలు కొట్టుకొంటూ తిరిగి వచ్చారు. రాజేశ్వరి వాళ్ళిద్దరికీ నీళ్లు పోసి, మడత బట్టలు కట్టింది. ఆకలంటూ యిద్దరు అరవడం మొదలుపెట్టారు. ముగ్గురికీ వడ్డించి, రాజేశ్వరి ఎదురుగా కుర్చీలో కూర్చుంది.

అన్నం తింటూ వసంత అంది 'అమ్మా తమ్ముడు ఎంత వద్దన్నా నీళ్ళలో దిగాడే!'

"అంతా ఉత్తిదే నాన్నారూ! అబద్ధమాడుతోంది" అన్నాడు వాసు.

"వెధవా, నేనబద్ధం ఆడుతున్నానా? 'డ్రిల్ మాస్టారన్నారు, ఫర్వాలేదు. ఆయన ఈత నేర్పుతా'రన్నారని నా ప్రాణం తోడేసి మరీ వెళ్ళావుగా"

వాసు ఇబ్బందిగా మొహం పెట్టాడు. వెంటనే, "నువ్వు మట్టుకు జామచెట్టు ఎక్క లేదూ? కొమ్మ విరిగి కింద పడబోతుంటే మేరీ మేడమ్ పట్టుకోబట్టి సరిపోయింది కాని, ఈ పాటికి మూతి పళ్ళు విరిగుండేవి!" అన్నాడు.

"నేరాలు తర్వాత చెప్పుకుందురుగాని, ముందు అన్నం తినండి" అంటూ రాజేశ్వరి యిద్దరికీ పెరుగు పోసింది. పెరుగన్నం తిని లేవపోతున్న వాళ్ళిద్దర్నీ రాజారావు, "ఆగండి మీ యిద్దరి తోటి ఓ ముఖ్యమైన విషయం చెప్పాలనుకొంటున్నాను" అని ఆపాడు.

గట్లు తెగి పొరుతున్న ఏటి కెదురీత ఈదడానికి ఎంత కష్టపడవలసి వస్తుందో, అంత కష్టంతో ఆ మాటలనగలిగాడు. ఒక్క బార ఈది అలిసిపోయాడు రాజారావు. రాజేశ్వరి స్థాణువులా కూర్చుండిపోయింది, జరగబోయే దారుణ మానసిక హింసాకాండలో

పాల్గొనడానికి ధైర్యాన్ని యిమ్మని భగవంతుణ్ణి ప్రార్థిస్తూ.

వాసూ, వసంతా, రాజారావుకేసి చూశారు. రాజారావు గొంతుక సవరించుకొన్నాడు. కాని నోటమ్మట మాట రాలేదు.

"చెప్పండి నాన్నారూ, నిద్ర ముంచుకొస్తోంది!" అన్నాడు వాసు.

"నీకు నిద్రగా ఉంటే నువ్వెళ్ళి పడుకో!" అంది వసంత.

"నాకొక్కడికే భయం బాబూ!"

రాజారావు వాళ్ళిద్దరి కేసి చూస్తూ ఉండిపోయాడు.

"అమ్మా, నువ్వు చెప్పవే" వసంత వెలవెలబోతున్న రాజేశ్వరి ముఖం కేసి చూస్తూ అడిగింది. రాజేశ్వరి తల దించుకొంది.

"మీ అమ్మ అయిస్క్రీం చేసి దాచిపెట్టింది. పట్టుబట్టి పిక్నిక్కు వెళ్ళినందుకు మీకూ, ప్రోత్సహించినందుకు నాకూ, పెట్టదట!"

రాజారావు మాటలు విని రాజేశ్వరి తల ఎత్తింది ఆశ్చర్యంగా. అంట చేతుల్తో వెళ్ళి పిల్లలిద్దరూ రాజేశ్వరి మెడను చుట్టేశారు.

"అమ్మా, ప్లీజ్, అయిస్క్రీం! ఇంకెప్పుడూ వెళ్లంలే!"

రాజేశ్వరి ఇద్దర్నీ అక్కున చేర్చుకొని ముద్దులతో నింపేసింది.

"ఛ! మీ నాన్నగారబద్ధాలాడతారు!" అంది హాయిగా నవ్వుతూ.

రాజేశ్వరి కళ్ళలోని వెలుగుని చూసి, రాజారావు హాయిగా ఊపిరి తీశాడు.

ఆరుబయట మంచం మీద రాజారావు గుండెల మీద తలాన్చి పడుకొంది రాజేశ్వరి.

"మీరెంత మంచివారండీ?"

ఆమె కన్నీటి పొరలు ప్రవాహాలై అతని గుండెల్ని తడిపేశాయి.

"బిడ్డల భవిష్యత్ కోసం మనం ఎంతైనా త్యాగం చెయ్యవలసి ఉంటుంది రాజీ! మన సంగతెలా ఉన్నా, ముందు ముందు వాళ్లకి, ఒకరి ఆసరా మరొకరికి అవసరం. వాళ్ళి ద్దరి మధ్యా అక్కా తమ్ముళ్ళ అనుబంధం విడవకుండా ఉండాలంటే, ఒకే తల్లి బిడ్డల మన్న భావన వాళ్ళకెంతైనా అవసరం. అందుకనే ప్రవాహానికి ఎదురీదలేకపోయాను" రాజారావు రాజేశ్వరి తల నిమురుతూ అన్నాడు వెన్నెల తెరలోకి చూస్తూ.

పిల్లలు యింటికి వెలుగులు. చంద్రుడు మింటికి వెలుగు. అయినా ప్రతి రాత్రీ వెన్నెల రాత్రి కాలేదు. ఏప్పుడో వచ్చే చీకటి రాత్రులకి భయపడి, నడుస్తున్న వెన్నెల రాత్రుల హాయిని అనుభవించలేకపోవడం అవివేకమే అవుతుంది.

వెన్నెల తెర వెనుకనున్న చీకటి పొరని గురించి రాజారావు మరి ఆలోచించదలచు కోలేదు.

('స్వాతి' మాసపత్రిక : జులై 1979)